సాక్షి
మెదక్

శనివారం । 4 । మే । 2024



ఇంటి నుంచే ఓటు

దివ్యాంగులు, వయోవృద్ధులు ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఎన్నికల సంఘం కల్పిస్తోంది.

వివరాలు IIలో ▸



యువతకు ఉపాధి

నిరుద్యోగులు, యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తానని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు.

వివరాలు IIలో ▸



'హాస్టల్' ప్రారంభమయ్యేనా?

పెద్దశంకరంపేట మోడల్‌స్కూల్‌కు హాస్టల్ భవనం కరువైంది. వచ్చే విద్యా సంవత్సరం నాటికైనా అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

వివరాలు IIIలో ▸

న్యూస్‌రీల్

కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్పండి: పోచారం



మాట్లాడుతున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): అబద్ధాల కాంగ్రెస్, బీజేపీలకు ఓటుతో బుద్ధి చెప్పాలని మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం కౌడిపల్లిలో ఎమ్మెల్యే సునీతారెడ్డి, ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్‌తో కలిసి రోడ్‌షో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. ప్రజలు రేవంత్‌ను నమ్మడం లేదని, అందుకే దేవుళ్లపై ఒట్లు పెడుతున్నారని విమర్శించారు. ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ రూ. వందకోట్లతో పీవీఆర్ ట్రస్ట్ ఏర్పాటు చేసి విద్యాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకుల బెదిరింపులకు భయపడవద్దని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు సార రామాగౌడ్, జిల్లా కోఆప్షన్ సభ్యుడు మన్సూర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, ఎంపీపీ రాజు నాయక్, జెడ్పీటీసీ కవిత, మండల ఎంపీటీసీ ఫోరం అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, మాజీ సీడీసీ చైర్మన్ దుర్గారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మెజార్టీ స్థానాలు గెలుస్తాం



నాయకులను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న సునీతారావు

నర్సాపూర్: పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మెజార్టీ స్థానాలు కైవసం చేసుకుంటుందని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం ఆమె నర్సాపూర్‌లో పర్యటించారు. ఈసందర్భంగా ఇతర పార్టీలకు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విశ్వసిస్తున్నారని పేర్కొన్నారు. మెదక్‌లో నీలం మధు విజయం ఖాయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నాయకులు సుహాసినిరెడ్డి, శ్రీనివాస్‌రావు, హర్షవర్ధన్, హబీబ్‌ఖాన్, చంద్రం కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ వైద్య సేవలు ప్రారంభం



ఆన్‌లైన్ సేవలను ప్రారంభిస్తున్న వైద్యులు

రామాయంపేట(మెదక్): రామాయంపేటలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఆన్‌లైన్ వైద్య సేవలను శుక్రవారం సూపరింటెండెంట్ డాక్టర్ లింబాద్రి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేషెంట్లు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి తమ అపాయింట్‌మెంట్‌ను ముందస్తుగా నమోదు చేసుకోవచ్చని సూచించారు. ఓపీతో పాటు అడ్మిషన్, డిశ్చార్జ్ రిపోర్టులు సైతం ఆన్‌లైన్‌లో పొందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో వైద్యులు సుకేశిని, వరుణ్, సిబ్బంది పాల్గొన్నారు.

రేవంత్ ఇచ్చింది కూడా గాడిద గుడ్డే

మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ ఫైర్

సిద్దిపేటజోన్: కేంద్రం తెలంగాణకు ఇచ్చింది గాడిద గుడ్డు అని ప్రచారం చేస్తున్న సీఎం రేవంత్.. సీఎం హోదాలో వచ్చిన రేవంత్‌రెడ్డి సిద్ది పేట భవిష్యత్తు గూర్చి ఏదైనా మంచి మాటలు చెప్తారని ఎదురుచూసిన ప్రజలకు గాడిద గుడ్డే మిగిలిందని మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి శర్మ ఎద్దేవా చేశారు. శుక్రవారం ఎమ్మెల్యే హరీశ్‌రావు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సిద్దిపేట ప్రజలకు ఏమి చేస్తారో చెప్పకుండా, తిట్ల దండకం చదివినట్లు చదివి వెళ్లారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజ లు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో పరిస్థితి దారుణంగా ఉందన్నారు. విద్యుత్, సాగునీటి సమస్యలు ఉన్నా ప్రభుత్వం స్పందన లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును విమర్శించే సీఎం రేవంత్ రెడ్డి మల్లన్న సాగర్ ద్వారా హైదరాబాద్ కు తాగునీరు తరలింపు ఆదేశాలు ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రుణమాఫీ అమలు చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని సూచించారు.



సాసర్‌పిట్లలో నీరు తాగుతున్న జంతువులు

వన్యప్రాణుల దాహం తీరింది

మెదక్‌జోన్: ఎండలు మండుతున్న నేపథ్యంలో అడవిలో సంచరించే జంతువుల దాహార్తిని తీర్చేందుకు అటవీశాఖ అధికారులు కదిలారు. రిజర్వ్ ఫారెస్టులో నిర్మించిన సాసర్‌పిట్లలో నీటిని ఎప్పటికప్పుడు నింపుతున్నారు. జిల్లాలో 58 వేల హెక్టార్లలో విస్తరించి ఉన్న రిజర్వ్ ఫారెస్టులో 524 సాసర్‌పిట్లు ఏర్పాటుచేశారు. దీంతో జంతువులు దాహం తీర్చుకుంటున్నాయి. కాగా అడవిలో అమర్చిన సీసీ కెమెరాల్లో జంతువులు నీరు తాగుతున్న దృశ్యాలు ఆకట్టుకుంటున్నాయి.

మేము సైతం సై..!

- జహీరాబాద్ బరిలో రిజిస్టర్డ్ పార్టీల అభ్యర్థులు
- ప్రజాశక్తి, ఫార్వర్డ్‌బ్లాక్, పిరమిడ్, ధర్మసమాజ్..
- ప్రజాబంధు, డెమొక్రటిక్ రీఫామ్స్ ఆఫ్ అలయన్స్ పార్టీలు
- సోషల్ మీడియా వేదికగా ప్రచారం



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: తెలంగాణ ప్రజాశక్తి పార్టీ.. ఆలిండియా ఫార్వర్డ్‌బ్లాక్ పార్టీ.. అలయన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రీఫామ్స్ పార్టీ.. ధర్మసమాజ్ పార్టీ.. పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా.. ఇండియా ప్రజాబంధు పార్టీ.. ఇలా జహీరాబాద్ లోక్‌సభ ఎన్నికల్లో రిజిష్టర్డ్ రాజకీయ పార్టీలు పోటీకి సై అంటున్నాయి. ప్రధాన పార్టీలతో పాటు ఈ రిజిష్టర్డ్ పార్టీల నుంచి అభ్యర్థులు బరిలోకి దిగారు. ప్రధాన పార్టీలు బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులతో పాటు రిజిష్టర్డ్ పార్టీలకు చెందిన ఆరుగురు అభ్యర్థులు పోటీలో ఉన్నారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 18 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. 25న స్వీకరణకు గడువు ముగియగా, మొత్తం 40 మంది అభ్యర్థులు 68 నామినేషన్లు దాఖలు చేశారు. 26న పరిశీలన ప్రక్రియ చేపట్టగా మొత్తం 18 నామినేషన్లను తిరస్కరించారు. ఉపసంహరణకు చివరి తేదీ 29తో ముగియగా ఏడుగురు అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకున్న విషయం తెలిసిందే. దీంతో మొత్తం 19 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. ఇందులో ముగ్గురు ప్రధాన పార్టీల అభ్యర్థులు, పది మంది స్వతంత్రులతో పాటు రిజిష్టర్డ్ పార్టీల నుంచి ఆరుగురు అభ్యర్థులు పోటీకి సై అంటున్నారు.

ఆ అభ్యర్థులు వీరే..

రిజిష్టర్డ్ పార్టీల అభ్యర్థులను పరిశీలిస్తే తెలంగాణ ప్రజాశక్తి పార్టీ నుంచి కొత్త బలిజ బస్వరాజ్, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నుంచి గుర్రపు మశ్చేందర్, అలియన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ నుంచి చావగని మని, ధర్మ సమాజ్ పార్టీ నుంచి టీడీఎస్ మని, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి మాలెపు మోహన్ రెడ్డి, ఇండియా ప్రజాబంధు పార్టీ నుంచి రోమాల బాబు దుర్గయ్యలు పోటీలో ఉన్నారు. స్వతంత్ర అభ్యర్థులుగా తలారి అశోక్, కమ్మరి నందీశ్వర్, జదావత్ జైపాల్ నాయక్, మహ్మద్ సద్దాం, మఠం మహదేవ్ స్వామి, బి.మారుతి రావు, ఎండీ యాకబ్ షరీఫ్, సజ్జాపూర్ రమేష్, ఎస్.రాజు, కొవ్వూరి సత్యనారాయణ గౌడ్ బరిలో నిలిచారు. అయితే వీరందరికీ ఎన్నికల అధికారులు గుర్తులు కేటాయించారు. రోడ్డు రోలర్, సింహం, చపాతి రోలర్, చెప్పులు, టెలివిజన్, బాక, గ్యాస్‌సిలిండర్ గుర్తులను కేటాయించారు. వీరితో పాటు స్వతంత్రులు కూడా తమ స్థాయిలో ప్రచారం చేస్తున్నారు. సోషల్‌మీడియా వేదికగా వీరి ప్రచారం ఎక్కువగా సాగుతోంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా సభలు, సమావేశాలు నిర్వహించడం ఖర్చుతో కూడుకున్నది కావడంతో సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేసుకుంటున్నారు.

కాంగ్రెస్ వచ్చాక అన్నీ గోవిందా





కార్నర్ మీటింగ్‌కు హాజరైన జనం, (ఇన్‌సెట్) మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

- దేవుడిపై ఒట్టు పెట్టి మోసం చేస్తున్నారు
- కారు మీద ఓటు గుద్దుతుంటే, గుంపుమేస్త్రీ గూబ పగలాలి
- తెలంగాణకు కేసీఆరే శ్రీరామ రక్ష
- ఎమ్మెల్యే హరీశ్‌రావు

అక్కన్నపేట(హుస్నాబాద్): తెలంగాణకు కేసీఆర్ శ్రీరామ రక్ష అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. అక్కన్నపేట మండల కేంద్రంలో శుక్రవారం బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్ని మాట్లాడారు. ఈ ఎన్నికలు తెలంగాణ భవిష్యత్తును, తలరాతను మార్చే ఎన్నికలన్నారు. ఆరు గ్యారంటీల్లో ఒక్కటే అమలు చేసి ఐదు అమలు చేశామని అబద్ధం చెబుతున్నారన్నారు. కాంగ్రెస్ వచ్చాక నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశన్నంటాయని, గ్రామాల్లో, తండాల్లో మంచినీళ్ల వస్తలేవన్నారు. దళితబంధు, రైతు బంధు, రైతు భీమా, కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మి, పింఛను అన్నీ గోవిందా అన్నారు. అలాగే మహాలక్ష్మి గ్యారంటీ మహా మోసమన్నారు. వినోదన్న అభివృద్ధి సాధకుడని, బండి సంజయ్ ఐదేళ్లలో కరీంనగర్‌కు ఏం చేశారో చెప్పాలని సవాల్ విసరారు. బీజేపీ పదేళ్ల పాలనలో సరుకుల ధరలు పెరగాయన్నారు.

గుంపు మేస్త్రీ గూబ పగలేలా..

గుంపు మేస్త్రీకి మాటలెక్కువ, చేతలు తక్కువ అని అన్నారు. గుంపు మేస్త్రీ గూబ పగలాలంటే కారు గుర్తుకు నొక్కాలని పిలుపునిచ్చారు. సిగ్గులేకుండా దేవుడిపై ఒట్టు పెట్టి మోసం చేస్తున్నారన్నారు. కాంగ్రెసోళ్లు అడ్డుకున్నా గౌరవెల్లి ప్రాజెక్టును 98శాతం పూర్తి చేశామన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా గౌరవెల్లి భూనిర్వాసితులకు పరిహారం చెల్లించామన్నారు. కాంగ్రెస్ వచ్చాక అంతా రివర్స్ అయిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్, ఎంపీపీ మాలోతు లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు భూక్య మంగ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో అవస్థలు

మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

రామాయంపేట(మెదక్): పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలు ఎన్నో అవస్థలు పడ్డారని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు ఆరోపించారు. శుక్రవారం రామాయంపేటలో కూరగాయల వ్యాపారులతో పాటు ఇతర పార్టీలకు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరగా కండువా కప్పి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే ఐదు అమలు చేసిందన్నారు. తాను గెలిచిన ఈ మూడు నెలల కాలంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టానని పేర్కొన్నారు. యువత మత్తు, గంజాయికి బానిస కాకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించామన్నారు. ఈ ఎన్నికల్లో ఇతర పార్టీల వారు డబ్బులిస్తే తీసుకొని ఓటు మాత్రం కాంగ్రెస్‌కే వేయాలని సూచించారు. ప్రజలకు బీఆర్‌ఎస్, బీజేపీ చేసిందేమిలేదన్నారు. కార్యక్రమంలో నాయకుడు సుప్రభాతరావు, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి రామచందర్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నాగులు, జిల్లా కన్వీనర్ విప్లవ్‌కుమార్, కార్యదర్శి బైరం కుమార్, పట్టణ కాంగ్రెస్ కార్యదర్శి అల్లాడి వెంకటేష్, జిల్లా నాయకులు ముత్యంరెడ్డి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి

జిల్లా ఎన్నికల అధికారి రాహుల్‌రాజ్



మీడియా సెంటర్‌లో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కలెక్టరేట్: ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లాలోని పీఓ, ఏపీఓ, పోలింగ్ సిబ్బందికి మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండోసారి నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో దిశానిర్దేశం చేశారు. పోలింగ్ రోజు ఉదయం 5.30 గంటలలోగా మాక్ పోలింగ్ పూర్తి చేయాలని, కనీసం ఇద్దరు ఏజెంట్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. అలాగే ఐడీఓసీ, ఆర్డీఓ మెదక్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ల సరళిని పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ల కోసం అన్ని రకాల ఏర్పాట్లు చేశామని వివరించారు.

కోడ్ ఉల్లంఘనలపై దృష్టి పెట్టండి

కోడ్ ఉల్లంఘనలపై అప్రమత్తంగా ఉండాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎన్నికల సమీకృత ఫిర్యాదుల పర్యవేక్షణ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా జీపీఎస్ మానిటరింగ్, 1950 కాల్ సెంటర్, కంట్రోల్ రూం, సీ- విజిల్, ఎంసీఎంసీ, సోషల్ మీడియా విభాగాల పనితీరును పర్యవేక్షించారు. అనంతరం మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి వచ్చే ఫిర్యాదులు, సామాజిక మాధ్యమాల్లో గమనించే ఎన్నికల కోడ్ ఉల్లంఘనలు తదితర నివేదికలను ప్రతిరోజు సమర్పించాలని సూచించారు. సాధారణ పరిశీలకుడు సమీర్ మాధవ్ కుర్కోటి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో రెండో ఈవీఎంల రాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశామని తెలిపారు. మెదక్ పార్లమెంట్ పరిధిలో 44 మంది అభ్యర్థులు బరిలో ఉన్నందున 3 బ్యాలెట్ యూనిట్లు, ఒక కంట్రోల్ యూనిట్‌ను ఆన్‌లైన్ ద్వారా ర్యాండమైజేషన్ చేశామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధి బాటలో గ్రామాలు

ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

నారాయణఖేడ్: రాహుల్‌గాంధీని ప్రధాని చేయడానికి జహీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి విజ్ఞప్తి చేశారు. మండలంలోని పంచగామ, కొండాపూర్ స్కూల్ తండా, తుర్కపల్లి తదితర గ్రామాల్లో అభ్యర్థి సురేష్ షెట్కార్, ఖేడ్ నియోజకవర్గ ఇన్‌చార్జి శశికళ యాదవరెడ్డిలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ పాలనలో పదేళ్లు అభివృద్ధి కుంటు పడిందని, కాంగ్రెస్ పాలనతో గ్రామాలు అభివృద్ధి పథంలో నడుస్తాయని తెలిపారు. అనంతరం కొండాపూర్ స్కూల్ తండాలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ జిల్లా సభ్యులు రాజు రాథోడ్, మాజీ ఎంపీటీసీ సభ్యులు రాంచందర్, పిప్రికి చెందిన గిరిజన నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఆయా కార్యక్రమాల్లో విఠల్‌రెడ్డి, రాకేష్ షెట్కార్, రమేష్ చౌహాన్, బాపు మల్‌శెట్టి, సుధాకర్‌రెడ్డి, శంకరయ్యస్వామి, సంగన్న, పండరిరెడ్డి, తాహెర్, చందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఎండిపోయిన వరి పంట

కౌలు రైతు కన్నీరు

శివ్వంపేట(నర్సాపూర్): ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి వచ్చే సమయంలో ఎండిపోవడంతో చివరికి కౌలు రైతుకు కన్నీరే మిగిలింది. మండల పరిధిలోని చిన్నగొట్టిముక్లకు చెందిన కర్రె చంద్రయ్య గ్రామానికి చెందిన పలువురి వద్ద ఆరు ఎకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేశాడు. భూగర్భజలాలు అడుగంటిపోవడంతో రెండు బోర్లలో నీటి మట్టం పడిపోయింది. దీనికి తోడు విద్యుత్ అంతరాయంతో చేతికి వచ్చిన పంట ఎండిపోయి బీటలు వారింది. రెండు తడులు అందితే గట్టెక్కేవాడినని బాధిత రైతు వాపోయాడు. పెట్టుబడి కోసం రూ. లక్షా 50 వేలు ఖర్చు చేశానని, అవి కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

వ్యథ తీరేలా.. బడి మురిసేలా!

బాలికల టాయిలెట్లకు మోక్షం | **రూ.871.50 లక్షలు మంజూరు**

పాఠశాలలకు వెళ్లిన బాలికలు ఇక ఉగ్గబట్టుకోవాల్సిన అవసరం లేదు. చాలీచాలని, శిథిలమైన టాయిలెట్లతో అవస్థలు పడాల్సిన పరిస్థితి ఉండదు. జిల్లాలోని 188 పాఠశాలల్లో కేవలం బాలికల కోసమే 249 టాయిలెట్ యూనిట్లు మంజూరయ్యాయి. ఇందుకోసం మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.871.50 లక్షలు కేటాయించారు.

– పాపన్నపేట(మెదక్)

జిల్లాలో 623 ప్రాథమిక, 128 ప్రాథమికోన్నత, 146 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 66,449 బాలికలు, 69,259 బాలురు విద్యనభ్యసిస్తున్నారు. చాలా పాఠశాలల్లో బాలికలకు సరిపోను టాయిలెట్లు లేవు. ఈ సమస్యను అధిగమించడానికి నీరు తక్కువగా తీసుకుంటామని పలుమార్లు బాలికలు తెలిపారు. దీంతో ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో కొన్ని టాయిలెట్లకు డోర్లు, మరికొన్నింటికి నీటి సౌకర్యం లేక నిరుపయోగంగా మారాయి.

188 పాఠశాలలు.. 249 యూనిట్లు

జిల్లాలో 188 పాఠశాలలకు 249 యూనిట్లు మంజూరయ్యాయి. ఉపాధి హామీ పథకం కింద ఇందు కోసం రూ.871.50 లక్షలు మంజూరయ్యాయి. అల్లాదుర్గం మండలంలో రూ.38.50 లక్షలతో 11 యూనిట్లు, రేగోడ్ రూ.14 లక్షలతో 4, టేక్మాల్ రూ.38.50 లక్షలతో 11 , చేగుంట రూ.63 లక్షలతో 18, నార్సింగి రూ. 3.50 లక్షలతో 1 యూనిట్, మనోహరాబాద్ రూ.35 లక్షలతో 10, తూప్రాన్ రూ.24.50 లక్షలతో 7, హవేళిఘనాపూర్ రూ. 59.50 లక్షలతో 17 , మెదక్ రూ.45.50 లక్షలతో 13, నిజాంపేట రూ.31.50 లక్షలతో 9 , పాపన్నపేట రూ.59.50 లక్షలతో 17, రామాయంపేట రూ.35 లక్షలతో 10, చిన్నశంకరంపేట రూ.52.50 లక్షలతో 15, శంకరంపేట(ఏ) రూ.59.50 లక్షలతో 17, చిలప్‌చెడ్ రూ.42 లక్షలతో 12, కౌడిపల్లి రూ.38.50 లక్షలతో 11, కొల్చారం రూ.52.50 లక్షలతో 15, మాసాయిపేట రూ.31.50 లక్షలతో 9, నర్సాపూర్ రూ.52.50 లక్షలతో 15, శివ్వంపేట రూ.42 లక్షలతో 12, వెల్దుర్తి రూ.52.50 లక్షలతో 15 యూనిట్లు మంజూరు అయ్యాయి.



పాపన్నపేట మండలం రాజ్యతండా బడిలో టాయిలెట్ల దుస్థితి

సమస్యలు తీరుతాయి



పాఠశాలలో బాలికలకు సరిపడా టాయిలెట్లు లేక ఇబ్బంది పడేవాళ్లం. ప్రభు త్వం కొత్త టాయిలెట్లు మంజూరు చేయడంతో సమస్య తీరుతుందని భావిస్తున్నాం. వాటిలో రన్నింగ్ వాటర్ సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకోవాలి.

– శరణ్య, 8వ తరగతి, కొడుపాక

క్లుప్తంగా

ప్రత్యేక భేటీ


సురేశ్‌కు మొక్కను అందజేస్తున్న నీలం మధు

పటాన్‌ చెరుటౌన్‌: ఏఐసీసీ మెదక్‌ పార్లమెంట్‌ ఎలక్షన్‌ అబ్జర్వర్‌ మాలవిక్కరా సురేశ్‌ని నీలం మధు ముదిరాజ్‌ శుక్రవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను నీలం మధు సత్కరించారు. అనంతరం సురేశ్‌ మెదక్‌ ఎన్నికలకు సంబంధించి అన్ని విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఏఐసీసీ మెదక్‌ పార్లమెంట్‌ ఎలక్షన్‌ అబ్జర్వర్‌ కొనసాగుతున్న మాళవిక్కరా సురేశ్‌ ఏడుసార్లు ఎంపీగా ఎన్నికయ్యారని మెదక్‌ ఎంపీ అభ్యర్థి మధు గుర్తు చేశారు.

క్రీడాకారులకు నిలయం భెల్‌

రామచంద్రాపురం(పటాన్‌చెరు): క్రీడలకు, క్రీడాకారులకు నిలయం భెల్‌ టౌన్‌ షిప్‌ అని భెల్‌ జీఎం, కమ్యూనిటీ సెంటర్‌ అధ్యక్షుడు చంద్రశేఖర్‌ అన్నారు. శుక్రవారం భెల్‌ టౌన్‌షిప్‌, కమ్యూనిటీ సెంటర్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమ్మర్‌ క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌ మాట్లాడుతూ.. భెల్‌ క్రీడా మైదానంలో ఆడిన క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని తెలిపారు. క్రీడల్లో రాణించే వారికి బంగారు భవిష్యత్‌ ఉంటుందన్నారు. ప్రతీ ఏడాది సమ్మర్‌ క్యాంప్‌ను ఏర్పాటు చేయడం హర్షదాయకమన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ సెంటర్‌ ప్రధానకార్యదర్శి శ్రీకాంత్‌, అధికారులు మాయబ్రహ్మలు పాల్గొన్నారు.

మతోన్మాద రాజకీయ పార్టీలను ఓడించండి

రాష్ట్ర కమిటీ సభ్యుడు అడివయ్య

కొమురవెల్లి(సిద్దిపేట): భువనగిరి పార్లమెంట్‌ ఎన్నికల్లో అవకాశవాద, మతోన్మాద పార్టీలను ఓడించిసీపీఎం అభ్యర్థి జహంగీర్‌ ను గెలిపించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అడివయ్య అన్నారు. శుక్రవారం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శెట్టిపల్లి సత్తిరెడ్డి, తాడూరి రవీందర్‌తో కలిసి మండలంలోని కిష్టపేటలో సీపీఎం అభ్యర్థి జహంగీర్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏనాడు కార్మికుల గురించి మాట్లాడని కాంగ్రెస్‌, బీజేపీ, బీఆర్‌ఎస్‌ అభ్యర్థులను ఓడించాలని అన్నారు. కేంద్రంలో పదేళ్ల అధికారంలో ఉన్న బీజేపీ ప్రజలపై భారాలు మోపిందన్నారు. కార్మిక చట్టాలను మార్చిన వారికి ఓటు ఎందుకు వేయాలని ప్రశ్నించారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థి సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుకే ఓటు వేసి జహంగీర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాదాసు యాదయ్య, వెలికట్ట కనకయ్య, రవి, పేర్ల రాములు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నుంచే ఓటు


దుబ్బాకలో ఇంట్లో ఓటు హక్కును వినియోగించుకుంటున్న వృద్ధుడు

మంచం మీద కూర్చొని ఓ వృద్ధురాలు.. చేతి కర్ర సాయంతో ఓ దివ్యాంగుడు, ఆటోలో ఓ ముసలవ్వ ఓటు వేసేందుకు పడే తిప్పలు గతంలో ఎన్నికల్లో కనిపించేవి. ఓటు వేసేందుకు నానా తిప్పలూ పడే వారు. కానీ, ఎన్నికల సంఘం వారి కష్టాలకు చెక్‌ పెట్టే పనిలో పడింది. అలా ఇబ్బంది పడే వారిని గుర్తించి ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని కల్పిస్తోంది.

– సాక్షి, సిద్దిపేట

- మెదక్‌ పార్లమెంట్‌ పరిధిలో 1,506కి అవకాశం
- ఇంటింటికీ వెళ్తున్న సిబ్బంది
- పెరుగనున్న పోలింగ్‌ శాతం
- 8వ తేదీ వరకు అవకాశం
- వృద్ధులు, దివ్యాంగులకు తప్పనున్న ఇబ్బందులు

ఇంటి నుంచి బయటకు రాలేని వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి నుంచే ఓటు హక్కును వినియోగించే అవకాశం కేంద్ర ఎన్నికల సంఘం కల్పించింది. ఈ క్రమంలో గత నెల 25వ తేదీ వరకు దివ్యాంగులు, వయో వృద్ధుల నుంచి 12డీ దరఖాస్తులను స్వీకరించారు. వాటిని పరిశీలించి ఇంటి నుంచే ఓటు హక్కును వినియోగించే అవకాశం కల్పించారు. మెదక్‌ పార్లమెంట్‌ పరిధిలో 1,506 మందిని గుర్తించారు. ఆయా ఏఆర్‌ఓ కార్యాలయాలకు వివరాలను పంపించడంతో ఇంటింటికీ తిరిగి ఇంటి నుంచి ఓటు హక్కును స్వీకరిస్తున్నారు. దీంతో పోలింగ్‌ శాతం పెరగనుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో సైతం ఇంటి నుంచి ఓటు వేసే అవకాశం పలువురికి కల్పించారు. తొలుత దుబ్బాక ఉప ఎన్నికల సందర్భంగా ఇంటి నుంచి ఓటు హక్కు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

ఈ నెల 8వ తేదీ వరకు

ఇంటి నుంచి ఓటు హక్కు వినియోగించుకునేందుకు దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 8వ తేదీ వరకు పోలింగ్‌ ప్రక్రియ జరగనుంది. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో ఇంటి నుంచి ఓటింగ్‌ ప్రక్రియ కొనసాగుతుంది. ఈ తేదీల్లో ఒక్కో ఓటరు ఇంటికి రెండు సార్లు వెళ్లనున్నారు. ఒక సారి ఓటు వేసేందుకు వీలు లేని వారికి మరో అవకాశం ఇస్తున్నారు. రెండు సార్లు పోలింగ్‌ సిబ్బందికి ఇంటికి వచ్చిన సమయంలో లేకపోతే ఇక ఓటును వినియోగించకుండా పోతుంది. సాధారణ పోలింగ్‌ కేంద్రాల్లో ఓటు వేసే అవకాశం ఉండదు.

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా..

నియోజకవర్గం	వృద్ధులు	దివ్యాంగులు
మెదక్‌	173	192
నర్సాపూర్‌	104	156
సిద్దిపేట	153	183
దుబ్బాక	184	137
గజ్వేల్‌	68	46
సంగారెడ్డి	31	29
పటాన్‌చెరు	31	19

ఓటు వేయకపోదును



నా వయస్సు 85 ఏళ్లు.. ఎండకు బయపడి బయటకు పోవడం లేదు. ఎమ్మెల్యే ఎన్నికల్లో ఆటోలో వెళ్లి ఓటు వేసి వచ్చాను. ఇప్పుడు శతనైతలేదు. ఇప్పుడు ఇంటికి రాకపోతే ఈ సారి ఓటును వేయకపోదును. ఎన్నికల సంఘం ఇలా అవకాశం కల్పించడం చాలా సంతోషదాయకం.

– లచ్చవ్వ, దుబ్బాక

ఇంట్లోనే పోలింగ్‌ బూత్‌

ఎన్నికల నిబంధనల ప్రకారం ఇంట్లోనే ఓటు వేసే సమయంలో ఎవరూ చూడకుండా ఉండే విధంగా తాత్కాలికంగా బూత్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతీ నియోజకవర్గంలో ఏఆర్‌ఓ ఆధ్వర్యంలో బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో ముగ్గురు అధికారులు, వీడియోగ్రాఫర్‌, మైక్రో అబ్జర్వర్‌, పోలీస్‌ సిబ్బంది ఉన్నారు. షెడ్యూల్‌ ప్రకారం సెక్టార్ల పరిధిలో ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఓటు వేయిస్తున్నారు. మెదక్‌ పార్లమెంట్‌ నియోజకవర్గం పరిధిలోని మెదక్‌ అసెంబ్లీ నియోజకవర్గంలో అత్యధికంగా ఇంటి నుంచి ఓటు హక్కును వినియోగించుకునే వారు ఉన్నారు. అత్యల్పంగా పటాన్‌చెరు నియోజకవర్గంలో ఉన్నారు.

ఉపాధి కల్పించడమే లక్ష్యం

- అల్లాదుర్గం, సంగుపేట ప్రాంతాల్లో పరిశ్రమలు నెలకొల్పుతాం
- మంత్రి దామోదర రాజనర్సింహ


మాట్లాడుతున్న మంత్రి దామోదర

అల్లాదుర్గం(మెదక్‌): నిరుద్యోగులకు, యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఆందోల్‌ నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తానని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. అల్లాదుర్గం మండలం ముస్లాపూర్‌ గ్రామంలో టేక్మాల్‌, అల్లాదుర్గం మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అల్లాదుర్గం, సంగుపేట ప్రాంతాల్లో పరిశ్రమలు నెలకొల్పేందుకు వందల ఎకరాల భూమిని సేకరించనున్నట్లు తెలిపారు. ఆందోల్‌ నియోజకవర్గంలో రూ. 500 కోట్లతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని అన్నారు. ఎన్నికల సమయంలో గ్రూపు తగదాలు, నిరుత్సాహం వీడలన్నారు. పార్లమెంట్‌ ఎన్నికల అనంతరం సర్పంచ్‌, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు వస్తాయని, ప్రతీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ అభ్యర్థులే గెలుపొందాలని ఆయన పేర్కొన్నారు.

దేవుడు వేరు .. రాజకీయాలు వేరు

కాంగ్రెస్‌ అభ్యర్థి సురేశ్‌ షెట్కార్‌

దేవుడు వేరు రాజకీయాలు వేరని బీజేపీ దేవుడి పేరుతో రాజకీయం చేస్తుందని జహీరాబాద్‌ లోక్‌ సభ కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థి సురేశ్‌ షెట్కార్‌ ఆరోపించారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీబీపాటిల్‌ ఈ ప్రాంతానికి ఏమి చేశారని ప్రశ్నించారు. కార్యక్రమంలో నారాయణఖేడ్‌ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు శేషారెడ్డి, టేక్మాల్‌ అధ్యక్షుడు రమేశ్‌, నాయకులు సురేశ్‌, నర్సింహారెడ్డి, బల్‌రాం, అఖిలాశ్‌రెడ్డి, మహేశ్‌, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

50 వేల మెజార్టీతో గెలిపించండి


మాట్లాడుతున్న జగ్గారెడ్డి

- నర్సాపూర్‌ అభివృద్ధి బాధ్యత నాది
- టీపీసీసీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ జగ్గారెడ్డి

నర్సాపూర్‌: మెదక్‌ కాంగ్రెస్‌ అభ్యర్థి నీలం మధుకు నర్సాపూర్‌ నియోజకవర్గం నుంచి 50 వేల మెజార్టీ ఇస్తే నర్సాపూర్‌కు ఏ పని కావాలంటే అది తాను దగ్గరుండి చేయిస్తానని జగ్గారెడ్డి హామీ ఇచ్చారు.కాంగ్రెస్‌ పార్టీ ఆధ్వర్యంలో మెదక్‌ కాంగ్రెస్‌ అభ్యర్థినీలం మధుకు మద్దతుగా పట్టణ శివారులోని మల్లన్న గుడి నుంచి బైక్‌ ర్యాలీ చేపట్టగా జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఏఐసీసీ పరిశీలకుడు కేరళకు చెందిన ఎంపీ సురేశ్‌ మాట్లాడుతూ.. కేంద్రంలో కాంగ్రెస్‌ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్నర్‌ మీటింగ్‌లో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మాట్లాడుతూ తనతోపాటు నీలం మధును బీఆర్‌ఎస్‌ మోసం చేసిందని ఆరోపించారు. డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్‌, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, సుహాసినిరెడ్డి తదితరులు ప్రసంగించారు. ర్యాలీలో పార్టీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, పార్టీ నాయకులు సుహాసినిరెడ్డి, మల్లేశ్‌, రాజుయాదవ్‌, చిన్న అంజిగౌడ్‌, హర్షవర్ధన్‌, శ్రీనివాస్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, సురేష్‌, అశోక్‌, లలిత, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థి సురేశ్‌ షెట్కార్‌


మాట్లాడుతున్న సురేశ్‌ షెట్కార్‌

నారాయణఖేడ్‌: కాంగ్రెస్‌ ప్రభుత్వం నాలుగు నెలల్లో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను, బీఆర్‌ఎస్‌ పదేళ్ల వైఫల్యాలను కార్యర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యవంతులను చేయాలని జహీరాబాద్‌ కాంగ్రెస్‌ అభ్యర్థి సురేశ్‌ షెట్కార్‌, ఎమ్మెల్యే డాక్టర్‌ సంజీవరెడ్డి సూచించారు. మనూరు మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కార్యకర్తలు సమష్టిగా సైనికుల్లా పని చేసి కాంగ్రెస్‌ జెండా ఎగురవేయాలని దిశానిర్దేశం చేశారు. కేవలం కాంగ్రెస్‌ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని, బీఆర్‌ఎస్‌ అభివృద్ధిని విస్మరించిందని దుయ్యబట్టారు. ఆరు గ్యారెంటీల్లో ఐదింటిని అమలు చేసి కాంగ్రెస్‌ ప్రభుత్వం ప్రజలకు చేరువైందన్నారు. ఆగస్టు 15 లోపు రుణమాఫీ అమలవుతుందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి శశికళ యాదవరెడ్డి, టీపీసీసీ సభ్యులు శంకరయ్యస్వామి, కర్నె శ్రీనివాస్‌, పార్టీ మండల అధ్యక్షుడు సుభాష్‌రావు, మాజీ జెడ్పీటీసీ నిరంజన్‌, మాజీ సర్పంచ్‌ దిగంబర్‌రెడ్డి, సిద్దారెడ్డి, దోండెరావు, రాజు, బ్రహ్మానందరెడ్డి, రాంచెందర్‌, విజయ్‌, మల్లుపటేల్‌, సంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇలాంటి సీఎంను ఎక్కడా చూడలే

బీఆర్‌ఎస్‌ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి



మాట్లాడుతున్న వెంకట్రామిరెడ్డి

పటాన్‌చెరు /పటాన్‌చెరు టౌన్‌: సిద్దిపేట మీటింగ్‌లో సీఎం రేవంత్‌ రెడ్డి తనపై అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమని బీఆర్‌ఎస్‌ మెదక్‌ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు శివారులోని జీఎంఆర్‌ ఫంక్షన్‌ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐఏఎస్‌గా ఐదుగురు ముఖ్యమంత్రుల వద్ద పని చేశా కానీ.. రేవంత్‌లా ఎవరూ బాధ్యతారాహిత్యంగా మాట్లాడలేదని తెలిపారు. అధికారిగా, కలెక్టర్‌గా 25 ఏళ్లు సుదీర్ఘంగా పని చేశానని, పార్టీలకతీతంగా తాను చేసిన సేవలకు సీఎంలు మెచ్చుకున్నారని తెలిపారు. మల్లన్నసాగర్‌ గురించి తనపై లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. మల్లన్న సాగర్‌, రంగనాయక సాగర్‌, కొండపోచమ్మ సాగర్‌ ప్రాజెక్టులు చాలా గొప్పవని చెప్పారు. గోబెల్స్‌ ప్రచారం చేసి లబ్ధి పొందాలనుకున్న రేవంత్‌ రెడ్డికి ఓటర్లే తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. మెదక్‌ ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. ఎమ్మెల్యే మహిపాల్‌ రెడ్డి మాట్లాడుతూ.. చదువుకున్న వ్యక్తి వెంకట్రామిరెడ్డిని లోక్‌సభకు పంపితే నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేస్తారని తెలిపారు.

ప్రజల దృష్టిని మళ్లించడానికే..


మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

- అమిత్‌షా మాటల్ని వక్రీకరించి ఫేక్‌ వీడియో విడుదల
- తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల ఎన్నికల కో ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి

జహీరాబాద్‌ టౌన్‌: రాష్ట్ర కాంగ్రెస్‌ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఫేక్‌ వీడియోను విడుదల చేశారని బీజేపీ సీనియర్‌ నాయకులు, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల లోక్‌సభ ఎన్నికల కో ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి ఆరోపించారు. కర్నాటక రాష్ట్రంలోని బీదర్‌ ఎన్నికల ప్రచారానికి వెళ్తూ శుక్రవారం పట్టణంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. దేశ హోం శాఖ మంత్రి అమిత్‌షా మాటల్ని వక్రీకరించి ఫేక్‌ వీడియో సృష్టించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. రాష్ట్ర, దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలు వచ్చాయన్నారు. ఇది క్షమించరాని నేరమని, దిగజారుడు రాజకీయాలకు పరాకాష్టని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీల రిజర్వేషన్‌కు బీజేపీ వ్యతిరేకం కాదన్నారు. కాంగ్రెస్‌పై ప్రజల్లో విశ్వాసం పోయిందని, లోక్‌ సభ ఎన్నికల్లో బీజేపీ డబుల్‌ డిజిట్‌ సీట్లు వస్తాయన్నారు. జహీరాబాద్‌ ఎంపీగా బీబీపాటిల్‌ విజయం ఖాయమన్నారు. గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు శ్రీనివాస్‌గౌడ్‌, శ్రీనివాస్‌గుప్త, అరుణ్‌ కుమార్‌, సుధీర్‌బండారీ, నరేశ్‌ పాటిల్‌, జనార్ధన్‌ రెడ్డి, అర్చన సరడా, పూల సంతోష్‌, ఏకనాథ్‌ పాటిల్‌, విశ్వనాథ్‌ తదితరులు పాల్గొన్నారు.

‘జిజ్ఞాస’ పోటీల్లో విద్యార్థుల సత్తా


ప్రశంసా పత్రాలతో ఉపాయులు, విద్యార్థులు

గజ్వేల్‌రూరల్‌: జిజ్ఞాస రాష్ట్రస్థాయి పోటీల్లో గజ్వేల్‌లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థినులు సత్తా చాటినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ పీవీ ఉమాశశి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్‌ హబ్‌లో గల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థినులు స్టూడెంట్‌ స్టడీ ప్రాజెక్ట్‌ జిజ్ఞాస పోటీల్లో ప్రథమ, తృతీయ స్థానాల్లో నిలిచారన్నారు. ఫిజిక్స్‌ విభాగంలో ‘డాటా ట్రాన్స్‌ మిషన్‌ యూజింగ్‌ లై–ఫై’ అనే అంశంలో అధ్యాపకురాలు డాక్టర్‌ పీ. సౌజన్య పర్యవేక్షణలో విద్యార్థినులు సాత్విక, మానస, పూజ, నమిత, పావని, సౌరక్క(ఎంపీసీ ఫైనల్‌ ఇయర్‌) ప్రథమ బహుమతి గెలుపొందారని, అదే విధంగా తెలుగు విభాగంలో ‘తెలంగాణ ఉద్యమంలో గద్దర్‌ ఆట–పాట’ అనే అంశంపై అధ్యాపకురాలు డాక్టర్‌ అనిత పర్యవేక్షణలో విద్యార్థినులు నీరజ, స్రవంతి, కావ్య, అనూష రాష్ట్రస్థాయిలో తృతీయ బహుమతిని అందుకున్నట్లు పేర్కొన్నారు. రాజ్‌భవన్‌ మార్గంలోని సంస్కృతీ భవన్‌లో ఈనెల 1న కమిషనర్‌ బుర్ర వెంకటేశం చేతుల మీదుగా ఫిజిక్స్‌ విభాగంలో రూ. 30 వేల నగదు పురస్కారం, తెలుగు విభాగంలో రూ. 12 వేల నగదు పురస్కారంతోపాటు ప్రశంసా పత్రాలను అందుకున్నారని తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్‌ అభినందించారు.

చిరుత సంచారం


సీసీ ఫుటేజీలో చిరుత

చేగుంట(తూప్రాన్‌): మండలంలోని ఇబ్రహీంపూర్‌ అటవీ ప్రాంతంలో చిరుత సంచరిస్తున్నట్లు ఫారెస్టు ఆఫీసర్‌ నాగరాణి తెలిపారు. శుక్రవారం విలేకరులతో ఆమె మాట్లాడారు. ఫారెస్టు అధికారులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలకు చిరుత సంచరిస్తున్న ఆనవాళ్లు దొరికాయన్నారు. ఇబ్రహీంపూర్‌తో పాటు రాంపూర్‌ కరీంనగర్‌, బోనాల, పులిమామిడి కిష్టాపూర్‌, చిట్టోజిపల్లి, రుక్మాపూర్‌ గ్రామాల ప్రజలు అటవీ ప్రాంతంలోకి వెళ్లరాదని సూచించారు. ఎవరైనా అడవిలోకి వెళ్తే వారే బాధ్యులని చిరుతను పట్టుకునే ఏర్పాట్లు చేస్తున్నట్లు నాగరాణి తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యాపారి ఆత్మహత్య


నాగార్జున (ఫైల్‌)

దుబ్బాక: ఆర్థిక ఇబ్బందులతో వ్యాపారి ఆత్మహత్య చేసుకున్న ఘటన దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. లచ్చపేటకు చెందిన రైస్‌మిల్‌ వ్యాపారి కాచం నాగార్జున(57) 25 ఏళ్లకు పైగా రైస్‌ మిల్‌ వ్యాపారం చేస్తున్నాడు. వ్యాపారంలో చాలా పెద్ద ఎత్తున నష్టం రావడంతో అప్పుల పాలయ్యాడు. దీంతో నాగార్జున ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ గంగరాజు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పెళ్లి రోజునే మృత్యు ఒడిలోకి..

- బైక్‌ను ఢీకొట్టిన మరో బైక్‌
- తీవ్ర గాయాలతో వ్యక్తి మృతి


వెంకటేశం (ఫైల్‌)

జగదేవ్‌పూర్‌(గజ్వేల్‌): పెళ్లి రోజే ఆ ఇంట విషాదం నెలకొంది. ఉదయమే భార్యా పిల్లలతో కలిసి గుడికెళ్లి పూజలు చేసిన సంతోషం తీరకముందే రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ విషాద ఘటన మండలంలోని తిగుల్‌ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తిగుల్‌ గ్రామానికి చెందిన కందుకూరి వెంకటేశం(45) అనిత దంపతులు. వీరికి కూతురు, కొడుకు ఉన్నారు. వెంకటేశం ప్రజ్ఞాపూర్‌లో విక్టరీ బార్‌లో పని చేస్తున్నాడు. శుక్రవారం పెళ్లి రోజు కావడంతో ఉదయమే భార్య అనిత, ఇద్దరు పిల్లలతో కలిసి గ్రామంలో శివాలయానికి వెళ్లి పూజలు చేశారు. అనంతరం 11 గంటల సమయంలో బార్‌ నుంచి ఫోన్‌ రావడంతో బైక్‌ వెళ్తున్నాడు. తిగుల్‌ గ్రామ సమీపంలోకి రాగానే ఎదురుగా గజ్వేల్‌ నుంచి తిగుల్‌ వైపు బైక్‌పై వెళ్తున్న ఎం.వెంకటేశం వేగంగా ఢీకొట్టాడు. దీంతో వెంకటేశం తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఎం.వెంకటేశ్‌కు సైతం తీవ్ర గాయాలయ్యాయి. తిగుల్‌ నుంచి బైక్‌పై గణేశ్‌పల్లి వైపు వెళ్తున్న మరో వ్యక్తి నర్సింలు రెండు బైక్‌లకు ఢీకొట్టడంతో స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను గజ్వేల్‌ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పెళ్లి రోజునే భర్త రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో భార్య అనిత, ఇద్దరు పిల్లల రోదనలు అందరినీ కంటతడి పెట్టించాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు జగదేవ్‌పూర్‌ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉదయం పెళ్లి చూపులు.. సాయంత్రం ఆత్మహత్యాయత్నం

చికిత్స పొందుతూ యువతి మృతి


మౌనిక (ఫైల్‌)

వర్గల్‌(గజ్వేల్‌): పెళ్లి చూపుల రోజే ఓ యువతి ఆత్మహత్యాహత్యానికి పాల్పడగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన వర్గల్‌ మండలం వేలూరులో చోటు చేసుకుంది. గౌరారం ఏఎస్‌ఐ శివ కుమార్‌ కథనం ప్రకారం.. వేలూరుకు చెందిన రాయన్న మల్లేశం దంపతుల కూతురు మౌనిక(21) టైలరింగ్‌ చేస్తూ కుటుంబానికి చేదోడుగా ఉంటుంది. తల్లిదండ్రులు గత నెల 27వ తేదీన కూతురికి ఇంట్లో పెళ్లి చూపులు జరిపించారు. పెళ్లి చూపులు మినహా పెళ్లికి సంబంధించి ఇరు కుటుంబాల మధ్య మాటముచ్చట కూడా జరగలేదు. అంతలోనే పెళ్లి చూపులు ఇష్టం లేకపోవడమో.. లేదా పెళ్లి ఇష్టం లేకనో తెలియదుగాని అదే రోజు సాయంత్రం మౌనిక ఇంట్లో గుర్తు తెలియని పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఇరుగుపొరుగు వారు గమనించి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశామని ఎస్‌ఐ తెలిపారు.

క్రైం కార్నర్‌

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

సిద్దిపేటకమాన్‌: సైబర్‌ మోసానికి పాల్పడిన నిందితుడిని సిద్దిపేట సైబర్‌ క్రైమ్‌ పోలీసులు గుర్తించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం సిద్దిపేట సీపీ అనురాధ తెలిపిన వివరాల ప్రకారం .. సిద్దిపేట పట్టణానికి చెందిన ఓ యువతి కొద్ది రోజుల కిందట ఓ లింకు ద్వారా ఆన్‌లైన్‌లో తన వివరాలు నమోదు చేసింది. గుర్తు తెలియని వ్యక్తి ఫోన్‌ చేసి కాంగ్నిజెంట్‌ కంపెనీలో బ్యాక్‌ డోర్‌ జాబ్స్‌ ఉన్నాయని చెప్పగా అతడి మాటలు నమ్మిన బాధితురాలు ఉద్యోగం వస్తుందనే ఆశతో గుర్తు తెలియని వ్యక్తి సూచించిన నంబర్‌కు ఆన్‌లైన్‌లో గూగుల్‌ పే ద్వారా పలు విడతలుగా రూ.16,75,750 పంపించింది. తర్వాత ఆ నంబర్‌ స్విచ్ఛాఫ్‌ రావడంతో బాధితురాలు సైబర్‌ క్రైమ్‌ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేపట్టారు. సైబర్‌ క్రైమ్‌ పోలీసు స్టేషన్‌ ఏసీపీ శ్రీనివాస్‌ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్‌ శేఖర్‌ సిబ్బందితో కలిసి అత్యాధునిక టెక్నాలజీ ఉపయోగించి నిందితుడిని గుర్తించారు. శుక్రవారం అరెస్టు చేసి జ్యుడిషియల్‌ రిమాండ్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇంజనీర్‌..

సిద్దిపేటకమాన్‌: రోడ్డు ప్రమాదంలో సివిల్‌ ఇంజనీర్‌ మృతి చెందిన ఘటన సిద్దిపేట పట్టణంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. సిద్దిపేట టూ టౌన్‌ సీఐ ఉపేందర్‌ కథనం మేరకు.. ఈస్ట్‌ గోదావరి ప్రాంతానికి చెందిన శ్రీసుధ వెంకట శ్రీరామారావు (58) విధి నిర్వహణలో భాగంగా నాలుగేళ్ల కిందట సిద్దిపేటకు వచ్చి మహాశక్తి నగర్‌లో కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. స్థానిక ఓ డెవలపర్స్‌లో సివిల్‌ ఇంజనీరింగ్‌ విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం రాత్రి పట్టణంలోని హౌజింగ్‌ బోర్డు కాలనీ వద్ద బైక్‌పై రోడ్డు దాటుతుండగా బొలేరో వాహనం ఢీకొట్టింది. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది శ్రీరామారావును సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత అదృశ్యం


పిల్లలతో అర్చన

తూప్రాన్‌: ముగ్గురు పిల్లలతో వివాహిత అదృశ్యమైన ఘటన మండలంలోని కిష్టాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివానందం కథనం మేరకు.. కిష్టాపూర్‌ గ్రామానికి చెందిన నర్సింహాచారికి యాదాద్రి జిల్లా పోచంపల్లి గ్రామానికి చెందిన అర్చనతో ప్రేమ వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ప్రస్తుతం తూప్రాన్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. కిష్టాపూర్‌లోని ఇంటి బాత్‌రూం నిర్మించి భార్యను సొంత ఊరికి తీసుకెళ్లేందుకు నర్సింహాచారిప్రయత్నిస్తుండడంతో అది నచ్చని అర్చన ముగ్గురు పిల్లలతో కనిపించకుండా పోయింది. చుట్టు పక్కల, బంధువుల వద్ద వెతికినా ఎలాంటి ఆచూకీ లభించలేదు. భర్త ఫిర్యాదు మేరకు మిస్సింగ్‌ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

తల్లిని చంపిన కొడుకు అరెస్ట్‌

మర్కూక్‌(గజ్వేల్‌): తల్లిని చంపిన కుమారుడిని శుక్రవారం మర్కూక్‌ పోలీసులు అరెస్ట్‌ చేశారు. గజ్వేల్‌ రూరల్‌ సీఐ మహేందర్‌రెడ్డి కథనం మేరకు.. మండలంలోని పాములపర్తి గ్రామానికి చెందిన పెద్దబోయిన నర్సింహులు గత నెల 27న శనివారం రాత్రి తల్లి పెద్దబోయిన భారతమ్మ, భార్య శిరీషతో కుటుంబ సమస్యల విషయంలో గొడవ పడ్డాడు. మద్యం సేవించిన నర్సింహులు భారతమ్మను తోసివేయడంతో కింద పడి తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. మర్కూక్‌ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం నిందితుడిని అరెస్ట్‌ చేసి జ్యుడిషియల్‌ రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడు


ప్రేమ్‌ (ఫైల్‌)

న్యాల్‌కల్‌(జహీరాబాద్‌): విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని గుంజోటి గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. హద్నూర్‌ ఎస్‌ఐ రామానాయుడు కథనం మేరకు.. గ్రామానికి చెందిన డోరే ప్రేమ్‌ (18) గురువారం రాత్రి ఇంట్లో విద్యుత్‌ బల్బ్‌ వెలగకపోవడంతో సరి చేస్తుండగా విద్యుత్‌ షాక్‌కు గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స మిమిత్తం సమీపాన గల బీదర్‌లోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కొద్దిసేపటికే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.